సాక్షి వనపర్తి

మంగళవారం । 8 । అక్టోబర్ । 2024



స్కందమాత.. నమోస్తుతే

అలంపూర్‌లోని జోగుళాంబదేవి సోమవారం స్కందమాతగా దర్శనమిచ్చారు.

వివరాలు 10లో ▸



ఆర్‌యూబీ రెడీ..

జడ్చర్లలో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి త్వరలోనే ప్రారంభం కానుంది.

వివరాలు 12లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
36.8 /21.8

వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. ఎండ ప్రభావం ఉంటుంది. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

42 శాతం రిజర్వేషన్ హామీ అమలుపర్చండి



వనపర్తిటౌన్: కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ అమలుపర్చాలని వెనుకబడిన కులాల సమాఖ్య (బీసీఎఫ్) రాష్ట్ర కన్వీనర్ ఎన్. చెన్నరాములు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల రిజర్వేషన్‌పై మాట్లాడిన తీన్మార్ మల్లన్నపై పోలీసు కేసు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 6.30 శాతం ఉన్న ఓసీ అగ్రకులాలు ఈడబ్ల్యూఎస్‌తో 10 శాతం రిజర్వేషన్ అనుభవిస్తున్నారన్నారు. ప్రభుత్వం బీసీలపై చిన్నచూపు చూడటం తగదన్నారు. సమావేశంలో బీసీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.కురుమూర్తి, ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య, రవికుమార్, వెంకటేశ్వర్లు, జానంపేట లీలావతి, సుభాష్ చంద్ర, అంజి ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం

పాన్‌గల్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు కొనసాగిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ అన్నారు. సోమవారం మండలంలోని రేమద్దులలో నిర్వహించిన మండల పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుపర్చడంలో విఫలమయ్యాయని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో జాప్యం చేస్తుందన్నారు. వచ్చేనెల 9, 10 తేదీల్లో వీపనగండ్లలో జిల్లా మూడో మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు బాల్‌రెడ్డి, వేణుగోపాల్, బాల్యానాయక్, వెంకటయ్య, ఆంజనేయులు, భగత్, జంబులయ్య, ఖాజా, భాస్కర్, మల్లేష్, చంద్రశేఖర్ ఉన్నారు.

ఆశావర్కర్ల ధర్నా



వనపర్తి రూరల్: ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆశావర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ముందుగా మర్రికుంట నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి మాట్లాడుతూ.. ల్యాబ్ టెక్నీషియన్లు చేయాల్సిన బీపీ, షుగర్ పరీక్షలను ఆశావర్కర్లతో చేయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆశావర్కర్లపై పనిభారం పెంచి, వేధింపులకు గురిచేయడం మానుకోవాలన్నారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బుచ్చమ్మ, కార్యదర్శి సునీత, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, నిక్సన్, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

మీనం.. సిద్ధం

10నుంచి చెరువుల్లో చేపపిల్లల విడుదల



చిన్నంబావి చెరువులో చేపపిల్లలను వదులుతున్న మత్స్యకారులు (ఫైల్)

- ఏర్పాట్లలో అధికార యంత్రాంగం నిమగ్నం
- జిల్లాలో 960 చెరువులు, కుంటలు
- మొదటి విడతగా 70 లక్షల చేపపిల్లల పంపిణీకి ప్రణాళిక

జిల్లాలో మత్స్యపారిశ్రామిక సహకార సొసైటీలు ఇలా..

మొత్తం సంఘాలు 143	సభ్యులు 13,664 మంది
పురుషుల మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలు 130	సభ్యులు 12,844 మంది
మహిళా మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలు 13	సభ్యులు 820 మంది

అమరచింత: మత్స్యకారులకు రాయితీపై చేపపిల్లల పంపిణీకి అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో నీటితో నిండిన చెరువులు, కుంటలతో పాటు రిజర్వాయర్లలో ఈ నెల 10వ తేదీ నుంచి చేప పిల్లలను వదిలేందుకు పక్కా ప్రణాళిక రూపొందించారు. ఈ ఏడాది చెరువులు, కుంటల్లో చేపపిల్లలు వదిలే కార్యక్రమం ఆలస్యం కావడంతో మత్స్యకారులు ఆందోళనకు గురయ్యారు. కొన్ని మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలు సొంత డబ్బుతో చేపపిల్లల కొనుగోలుకు ప్రయత్నాలు సాగిస్తున్నాయి. ఈ క్రమంలోనే రాయితీపై చేపపిల్లల పంపిణీకి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమకు మంజూరైన చేప పిల్లలను త్వరగా తెప్పించుకొని చెరువులు, కుంటల్లో వదిలేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

మొదటి విడతగా 70 లక్షల చేపపిల్లలు..

జిల్లాలో 960 చెరువులు, కుంటలతో పాటు నాలుగు రిజర్వాయర్లు ఉండగా.. 1.20 కోట్ల చేపపిల్లలు అవసరమని జిల్లా అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఈ మేరకు టెండర్లు ఆహ్వానించగా.. కాంట్రాక్టర్లు సకాలంలో ముందుకు రాకపోవడంతో టెండర్ల ప్రక్రియ ఆలస్యమైంది. అయితే విడతల వారీగా చేపపిల్లలు పంపిణీ చేయాలని సంబంధిత అధికారులు నిర్ణయించారు. మొదటి విడతగా 70 లక్షల చేపపిల్లల పంపిణీకి చర్యలు చేపట్టారు. వీటిని జిల్లాలోని నాలుగు రిజర్వాయర్లతో పాటు 73 చెరువుల్లో వదిలేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

మత్స్యకారుల ఎదురుచూపులు..

ఈసారి వర్షాలు సమృద్ధిగా కురవడంతో చెరువులు, కుంటల్లోకి భారీగా నీరు వచ్చి చేరింది. అయితే టెండర్ల ప్రక్రియలో జాప్యంతో చేపపిల్లల పంపిణీపై మత్స్యకారులు అయోమయానికి గురయ్యారు. రాయితీ చేపపిల్లల కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తూ వస్తున్నారు. కొన్ని సొసైటీలు తమ శక్తిమేర చేపపిల్లలను కొనుగోలు చేసి, చెరువుల్లో వదిలేందుకు సిద్ధమయ్యాయి. ఎట్టకేలకు ప్రభుత్వం చేపపిల్లల విడుదలకు శ్రీకారం చుట్టింది. జిల్లావ్యాప్తంగా చెరువులు, కుంటల్లో 1.20 కోట్ల చేప పిల్లలను వదిలి మత్స్యకారులకు మెరుగైన ఉపాధి కల్పించాలని కోరుతున్నారు.

త్వరగా అందించాలి..



ప్రభుత్వం రాయితీపై అందించే చేప పిల్లలను త్వరగా చెరువుల్లో వదలాలి. ఇప్పటికే చెరువులు పూర్తిస్థాయిలో నిండి నెల రోజులు దాటుతోంది. సకాలంలో చేపపిల్లలను వదిలితే మత్స్యకారులకు లాభదాయకంగా ఉంటుంది.

– వెంకటన్న, మత్స్యకారుడు, అమరచింత

సంతోషంగా ఉంది..



మత్స్యకారులకు మెరుగైన ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం రాయితీపై చేపపిల్లలు అందించడం సంతోషంగా ఉంది. వర్షాకాలం ముగిసే లోగా చేప పిల్లలను చెరువుల్లో వదిలితే బాగుండేది. టెండర్ల ప్రక్రియ ముగిసినందున, ఇక ఆలస్యం చేయకుండా చెరువుల్లో చేపపిల్లలను వదలాలి.

– రవికాంత్, ప్రధాన కార్యదర్శి, మత్స్యసహకార సంఘం, అమరచింత

ప్రణాళిక మేరకు..



జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువుల్లో చేపపిల్లలను వదిలేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నాం. ముందుగా జిల్లాకు వచ్చిన 70 లక్షల చేపపిల్లలను 4 రిజర్వాయర్లు, 73 చెరువులకు అందిస్తాం. మిగిలిన చెరువుల్లో రెండో విడత వదులుతాం. టెండర్ల ప్రక్రియలో జాప్యంతో చేప పిల్లల పంపిణీలో ఆలస్యమైంది. – డా.లక్ష్మప్ప, మత్స్యశాఖ ఏడీ

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ.. కలెక్టరేట్‌కు వచ్చే అర్జీలతో పాటు సీఎం కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి దాఖలయ్యే అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించాలని సూచించారు. అందుకు సంబంధించిన నివేదికను ఎప్పటికప్పుడు తనకు అందజేయాలన్నారు. రెవెన్యూ శాఖలో అత్యధికంగా ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో ఉండటంతో కలెక్టర్ అసహనం వ్యక్తంచేశారు. అధికారులు ప్రతి సోమవారం చేనేత వస్త్రాలను ధరించి రావాలని కోరారు. ప్రజావాణిలో మొత్తం 70 అర్జీలు దాఖలైనట్లు గ్రీవెన్స్ సెల్ అధికారి తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, ఎం.నగేష్ పాల్గొన్నారు.

వివరాల నమోదులో జాగ్రత్తలు పాటించాలి

పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన తెలంగాణ కుటుంబ సర్వే వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. కలెక్టర్ చాంబర్‌లో సర్వే బృందంతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని 10వ వార్డు, వనపర్తి మండలంలోని అంజనగిరిలో సర్వే చేపట్టి, పూర్తి చేశారన్నారు. అంజనగిరిలో 223, మున్సిపల్ వార్డులో 771 కుటుంబాల వివరాలు సేకరించినట్లు తెలిపారు. వివరాల నమోదు అనంతరం ర్యాండమ్‌గా చెక్ చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, తహసీల్దార్ రమేష్‌రెడ్డి ఉన్నారు.

పోలీస్ ప్రజావాణికి 17 అర్జీలు..



అర్జీదారుల సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ రావుల గిరిధర్

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 17 అర్జీలు దాఖలయ్యాయి. ఎస్పీ రావుల గిరిధర్ అర్జీదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పరిష్కారం కోసం అర్జీలను ఆయా ప్రాంతాల పోలీసు అధికారులకు ఎస్పీ సిఫారసు చేశారు. దాఖలైన అర్జీలలో భూతగాదాలకు సంబంధించి తొమ్మిది, కుటుంబ తగాదాలపై ఒకటి, పరస్పర ఘర్షణలకు సంబంధించి ఏడు అర్జీలు దాఖలయ్యాయి.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



కల్వకుర్తిలో కేజీబీవీ అప్‌గ్రేడ్ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు

- దసరా కానుకగా పేదలకు మంజూరు చేస్తాం
- నూతన ఆర్‌ఓఆర్ చట్టంతో రైతులకు మేలు
- రాష్ట్ర రెవెన్యూ, సమాచార, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

కల్వకుర్తి/ కల్వకుర్తి టౌన్: అర్హులైన ప్రతిఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి కల్వకుర్తిలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు, రైతులకు, బడుగు బలహీన వర్గాలకు, నిరుపేదలకు వ్యూహాత్మకంగా పథకాలను అమలు చేసిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఐదు గ్యారంటీలను అమలు చేశామని, మరో గ్యారంటీని త్వరలోనే అమలు చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి డిజిటల్ గుర్తింపు కార్డులను ఇచ్చి ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. ప్రజా ప్రభుత్వంలో నూతనంగా తీసుకొస్తున్న ఆర్‌ఓఆర్ చట్టంతో రైతులకు చాలా మేలు జరుగుతుందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చి రైతులను ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. రైతు పక్షపాతిగా ఉండే తమ ప్రభుత్వం ఏకకాలంలో రైతు రుణమాఫీకి సంబంధించిన రూ.31 వేల కోట్లు కేటాయించి మాఫీ చేసిందని గుర్తుచేశారు. నూతన ఆర్‌ఓఆర్ చట్టంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ బదావత్ సంతోష్, పీసీసీ సభ్యుడు బాలాజీసింగ్, మున్సిపల్ చైర్మన్ సత్యం, ఆర్డీఓ సత్యం, డీఎస్పీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం హామీలు నెరవేర్చడానికే వచ్చా..

సీఎం రేవంత్‌రెడ్డి కల్వకుర్తి పర్యటనలో భాగంగా ప్రకటించిన వరాలను నెరవేర్చడానికే వచ్చానని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని టీఎస్‌ఎఫ్‌యూడీసీ కింద రూ.10 కోట్లు, అమృత్ 2.0 కింద రూ.23 కోట్లు, స్టేడియం ఆధునీకరణకు రూ.1.3 కోట్లు, కేజీబీవీని జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసేందుకు రూ.3.2 కోట్లు, ఎస్‌డీఎఫ్ కింద రూ.1.07 కోట్లు, మరిన్ని ఇతర పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ నూతన కార్యాలయాన్ని అత్యంత సుందరంగా నిర్మిస్తామని చెప్పారు. హామీల మేరకు రూ.44 కోట్ల పనులకు శంకుస్థాపన చేశామని, త్వరలోనే మరిన్ని హామీలను నెరవేర్చడానికి ప్రభుత్వం సుముఖంగా ఉందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా ప్రజలకు మేలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా పనిచేస్తున్నారని, ఎన్ని కష్టాలు వచ్చినా పేదలకు మేలు చేస్తామన్నారు.

చిరుధాన్యాల ఆధారిత ఉత్పత్తులతో ఉపాధి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ దామోదర్

మదనాపురం: చిరుధాన్యాల ఆధారిత ఉత్పత్తులతో మెరుగైన ఉపాధి లభిస్తుందని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త రాజేందర్, ఏడీఏ దామోదర్ అన్నారు. మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తులపై నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిరుధాన్యాలు అనేవి సంప్రదాయ ఆహార పంటలలో ఒకటని అన్నారు. అన్ని కాలాల్లోనూ చిరుధాన్యాలు పండుతాయన్నారు. ప్రజల జీవన శైలిలో మార్పులతో మధుమేహం, క్యాన్సర్, గుండె వ్యాధిగ్రస్తులు పెరిగారన్నారు. అలాంటి వ్యాధులను అరికట్టాలంటే చిరుధాన్యాల ఆహారం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యువతీ యువకులు చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కేవీకే ఆధ్వర్యంలో వారం రోజులపాటు అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు అనిత, భవాని తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛమైన తాగునీరు అందివ్వాలి'



మాట్లాడుతున్న మిషన్ భగీరథ ఎస్‌ఈ వెంకటరమణ

వీపనగండ్ల: గ్రామాల్లోని ప్రజలకు మిషన్ భగీరథ పథకం ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని మిషన్ భగీరథ ఎస్‌ఈ వెంకటరమణ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో చిన్నంబావి, వీపనగండ్ల మండలాల తాగునీటి సరఫరా సహాయకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు సమపాళ్లలో బ్లీచింగ్ పౌడర్ కలపాలని సూచించారు. తాగునీటి సరఫరా సహాయకులకు మెళకువలు నేర్పించడంతో గ్రామీణ ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఈఈ మేఘారెడ్డి, డిప్యూటీ ఇంజినీర్ అమిత్‌కుమార్, ఎంపీడీఓలు శ్రీనివాసరావు, రమణారావు, ఏఈలు ఉదయ్‌కుమార్, రవితేజారెడ్డి పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీలకు శ్రీకారం

మండల, జిల్లా, రాష్ట్రస్థాయి వరకు క్రీడాపోటీలు

- 15న ఉమ్మడి జిల్లాలో ప్రవేశించనున్న టార్చ్ రిలే
- ఔత్సాహిక క్రీడాకారులకు చక్కటి వేదిక
- గతేడాది రాష్ట్రస్థాయి విజేతలకు నగదు పారితోషికాలు



మహబూబ్‌నగర్‌లోని మెయిన్ స్టేడియంలో జరిగిన సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడాపోటీలు (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రీడలు: మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో క్రీడల సందడి నెలకోనుంది. గతేడాది బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మే 15వ తేదీ నుంచి 31 వరకు మండల, జిల్లా, రాష్ట్రస్థాయి వరకు క్రీడాపోటీలు నిర్వహించగా.. తాజాగా ఈ ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం కప్– 24 క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టింది. ఈ నెలలోనే క్రీడా పోటీలు నిర్వహించనున్నారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా..

సీఎం కప్– 24 క్రీడా పోటీలను పురస్కరించుకొని సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 3న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో టార్చ్ రిలేను (క్రీడా జ్యోతి) ప్రారంభించారు. ఈ టార్చ్ రిలే ఈ నెల 15 నుంచి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కొనసాగనుంది. నల్లగొండ నుంచి టార్చ్ రిలే 15న ఉమ్మడి జిల్లాలోకి ప్రవేశిస్తుంది. ఉదయం కలెక్టరేట్ నుంచి లిటిల్ ఫ్లవర్ స్కూల్ వరకు (10 కేఎం రన్) నిర్వహించి వివిధ గ్రామాలు, పట్టణాల మీదుగా సాయంత్రం చిట్యాల నుంచి వనపర్తి కలెక్టరేట్ వరకు (10 కేఎం), 16న ఉదయం సంగాల పార్క్, ధరూర్ నుంచి జోగుళాంబ గద్వాల కలెక్టరేట్ వరకు, సాయంత్రం త్రిపాసిపల్లి నుంచి నారాయణపేట నర్సిరెడ్డి చౌరస్తా వరకు, 17న ఉదయం మహబూబ్‌నగర్ పట్టణంలోని ఎకో అర్బన్ నుంచి వికేర్ ఆస్పత్రి వరకు కొనసాగనుంది. అనంతరం వివిధ గ్రామాల మీదుగా సాయంత్రం వరకు రంగారెడ్డి జిల్లాలోకి ప్రవేశిస్తుంది. ఆయా జిల్లాలకు సంబంధించి ఈ టార్చ్ రిలేకు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారులను ఇన్‌చార్జీలుగా నియమించారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహం

గతేడాది జరిగిన రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతులు అందించనున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఆరు క్రీడాంశాల్లో గెలుపొందిన క్రీడాకారులు నగదు బహుమతులు అందుకోనున్నారు. త్వరలో ఆయా క్రీడాకారుల అకౌంట్లలో నగదు జమ కానుంది. వాలీబాల్ పురుషుల విభాగంలో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు ప్రథమ స్థానం, ఫుట్‌బాల్ పురుషుల విభాగంలో జోగుళాంబ గద్వాల జట్టు ద్వితీయ, జిమ్నాస్టిక్ పురుషుల విభాగం టేబుల్ వాల్ట్‌లో జి.విజయ్‌కుమార్ ద్వితీయ, వెయిట్ లిఫ్టింగ్ 67 కిలోల విభాగంలో జి.శ్రీకాంత్ ద్వితీయ, ఆర్చరీ 50 మీటర్ల పురుషుల కంపౌండ్ రౌండ్‌లో ఎన్.విష్ణువర్ధన్ ద్వితీయ, మహిళల్లో 50 మీటర్ల కంపౌండ్ రౌండ్‌లో ఆర్.సుజాత తృతీయ స్థానాల్లో నిలిచారు.

వివిధ క్రీడాంశాల్లో పోటీలు

గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ఆణిముత్యాలను వెలికితీయడానికి సీఎం కప్ క్రీడాపోటీలు ఎంతగానో దోహదపడుతున్నాయి. క్రీడాకారులకు ఒక వేదికగా సీఎం కప్ నిలవనుంది. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, బాక్సింగ్, స్విమ్మింగ్, రెజ్లింగ్, ఆర్చరీ, జిమ్నాస్టిక్, హాకీ, లాన్‌టెన్నిస్, షూటింగ్, టేబుల్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్‌తోపాటు ఇతర క్రీడలకు సంబంధించి పోటీలు జరగనున్నాయి.

క్రీడాకారులకు సదావకాశం



సీఎం కప్ క్రీడలు ఔత్సాహిక క్రీడాకారులకు సదావకాశం. సీఎం కప్ క్రీడలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి. సీఎం కప్ టార్చ్ రిలే ఈ నెల 17న మహబూబ్‌నగర్ జిల్లాకు చేరుకుంటుంది. అందరి సహకారంతో రిలే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తాం.

– శ్రీనివాస్, డీవైఎస్‌ఓ, మహబూబ్‌నగర్



నల్లమలను పర్యాటకంగా తీర్చిదిద్దుతాం

- రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ
- అట్టహాసంగా ఉమామహేశ్వర దేవస్థానం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం

– వివరాలు 12లో..

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో బాలుడు మృతి



లింగాల: విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందిన సంఘటన లింగాలలో సోమవారం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అశోక్, శిరీష దంపతులకు మొదటి సంతానం బాలుడు(11నెలలు) పుట్టాడు. సోమవారం ఇంట్లో ఆడుకుంటూ గోడకు కిందిబాగంలో ఉన్న కరెంట్ స్విచ్ బోర్డులో వేలు పెట్టాడు. దీంతో వెంటనే విద్యుదాఘాతానికి గురై పడిపోయాడు. ఇంటి బయట ఉన్న తల్లి లోపలికి వచ్చి వెంటనే ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ డాక్టర్లు పరీక్షించి బాలుడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బాలుడి మృతితో కుటుంబం కన్నీరు మున్నీరైంది.

కిందపడి యువకుడి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రమాదవశాత్తు కిందపడి యువకుడు మృతి చెందిన సంఘటన కుమ్మెర గ్రామసమీపంలోని పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు క్యాంపు వద్ద ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్సై గోవర్ధన్ తెలిపిన సమాచారం మేరకు.. చత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతేవాడ జిల్లాదక్షిణ బస్తర్ గ్రామానికి చెందిన షెన్ కవాసి(20) ఏడాది కాలంగా పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనుల వద్ద ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి ప్రాజెక్టు క్యాంపు వద్ద ప్రమాదవశాత్తు కిందపడటంతో తలకు రాయి తగిలి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనకు సంబంధించి మృతుడు తమ్ముడు సునీల్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యల్లందొడ్డిలో వ్యక్తి ఆత్మహత్య

గట్టు : యల్లందొడ్డికి చెందిన డీలర్ శ్యామల భర్త హనుమంతు(55)క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. హనుమంతు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తట్టుకోలేక ఆదివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో క్రిమి సంహారక మందు తాగాడు. విషయాన్ని చట్టు పక్కల వారు గమనించి అతడిని గద్వాల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. హనుమంతుకు భార్యతో పాటు ముగ్గురు కుమార్తెలున్నారు. ఘటనపై కేసునమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి ..

మక్తల్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఖానాపూర్‌నకు చెందిన నాగరాజు (22) కర్నికి చెందిన జ్యోతిని వివాహం చేసుకుని ఇల్లరికం వెళ్లాడు. ఈ నెల 3న భార్యభర్తలు ఇద్దరు పొలం పనుల విషయంలో గొడవ పడగా నాగరాజు క్షణికావేశంలో అత్తగారి ఇంటి మిద్దె పైకి వెళ్లి పురుగుల మందు తాగాడు. కొంతసేపటి తర్వాత భార్య గమనించి చికిత్స నిమిత్తం అతడి మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున నాగరాజు మృతి చెందాడు. విషయంపై అతడి అన్న నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు.

స్కందమాత నమోస్తుతే..



అమ్మవారి సన్నిధిలో భక్తులు

- జోగుళాంబ ఆలయంలో కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు
- నేడు పట్టు వస్త్రాలు సమర్పించనున్న మంత్రి కొండా సురేఖ

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా అయిదో రోజు సోమవారం స్కందమాతగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ''సింహాసనగతానిత్యంపద్మాశ్రిత కరద్వయా శుభదాస్తు సదాదేవి స్కందమాత యశ్విని'' అంటూ.. ఆలయ అర్చకులు భక్తకోటి చేత అమ్మవారి ధ్యాన శ్లోకాన్ని పలికించారు. కమలాసనంపై పద్మాసనంగా శ్వేత పద్మంతో ఈ అమ్మవారు శోభిల్లుతుంది కాబట్టి.. ఈ సందర్భంగా అమ్మవారిని ధ్యానం చేస్తే అరిషట్ వర్గాలు తొలగిపోతాయని దేవి భాగవతంలో చెప్పినట్టు అర్చకులు పేర్కొన్నారు. వాసవీమాత ఆలయంలోనూ విశేష పూజలు జరుగుతున్నాయి. భైరాపురంలోని నిత్యభావన ఆశ్రమంలోనూ హోమాలు, అన్నదానాలు, సత్సంగాలు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ సేవకులు ధనుంజయ శర్మ, నూనెపల్లి కృష్ణమూర్తి శర్మ తెలిపారు.

ప్రధాన ఆలయంలో ప్రత్యేక పూజలు

క్షేత్రంలో ప్రధాన ఆలయమైన బాలబ్రహ్మేశ్వరుడికి భక్తులు ఏకవార రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంకాలం దాక అభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు.

నేడు పట్టువస్త్రాల సమర్పణ

రాష్ట్ర ప్రభుత్వం తరపున జోగుళాంబ అమ్మవారికి ఈ నెల 08న మంగళవారం దేవదాయశాఖ మంత్రి కొండసురేఖ పట్టువస్త్రాలను సమర్పించనున్నట్లు ఆలయ ఈవో పురేందర్ కుమార్, ఏబీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ తెలిపారు. వరంగల్ జిల్లా భద్రకాళి నృత్యకళాక్షేత్రం నుంచి పిండి శుభాషిణి నేతృత్వంలో చిన్నారులు వేర్వేరుగా కూచిపుడి, భరతనాట్యం ప్రదర్శనలు చేశారు. ఈఓ పురేందర్‌కుమార్, ప్రధాన అర్చకులు ఆనంద్ శర్మ వారికి ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.



ప్రశంస పత్రాలు అందజేస్తున్న ఆలయ ఈవో పురేందర్‌కుమార్, ప్రధాన అర్చకులు



నృత్య ప్రదర్శనలో చిన్నారులు

ప్రైవేట్ ఆస్పత్రిలో నవజాత శిశువు మృతి

ఆసుపత్రి ఎదుట బంధువుల నిరసన



ఆందోళన చేస్తున్న బంధువులు

గద్వాల క్రైం: ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కాన్పు సమయంలో నవజాత శిశవు మృతి చెందిన ఘటన గద్వాల జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ కథనం మేరకు.. మల్దకల్ మండలం ఎల్కూరుకి చెందిన కిరణ్‌కుమార్ రెడ్డి భార్య నాగరాణి సోమవారం 11:30 గంటల సమయంలో ప్రసవం కోసం గద్వాల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చారు. వైద్యులు పరీక్షించి మధ్యాహ్నం 3 గంటల సమయంలో సాధారణ ప్రసవం నిమిత్తం .. కాన్పుల వార్డుకు తీసుకెళ్లారు. అయితే సాధారణ ప్రసవం అవుతుందని మొదట చెప్పారని.. ఇంతలోనే శిశువు మృతి చెందిందని వైద్యులు తెలిపారని బంధువులు అన్నారు. వారి నిర్లక్ష్యం కారణంగా నవజాత శిశువు మృతి చెందినట్లు ఆరోపించారు. పెళ్లైయిన నాలుగు సంవత్సరాల తర్వత మొదటి కాన్పు కోసం వస్తే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. శిశువు మృతికి వైద్యులే కారణమని ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న సీఐ నాగేశ్వరరెడ్డి, సిబ్బందితో ఘటనా స్థలానికి వచ్చి ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. ఈ విషయంపై వైద్యురాలు బిందు మాధవిని సంప్రదించగా... సాధారణ ప్రసవం సమయంలో గర్భిణీ నొప్పులు తీసుకోవడం లేదన్నారు. పలుమార్లు స్పందన లేకపోవడంతో శిశువు గర్భంలోనే మృతి చెందిందన్నారు. ప్రతి అంశాన్ని వారి కుటుంబ సభ్యుల సమక్షంలోనే తెలియజేస్తూ ప్రసవం చేశామన్నారు. ఎక్కడా వైద్యుల నిర్లక్ష్యం లేదన్నారు. ఆ సమయంలో శస్త్ర చికిత్స చేస్తే తల్లి, బిడ్డకు ప్రమాదం ఉండేదన్నారు.

జూరాలకు 44వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు/ఆత్మకూరు: జూరాల ప్రాజెక్టుకు సోమవారం రాత్రి 8 గంటల వరకు 44,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. ఒక క్రస్టు గేటును ఎత్తి 7,215 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం ప్రాజెక్టు నుంచి 38,925 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుంటున్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 95 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,140 క్యూసెక్కులు, కుడి కాల్వకు 730 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 300 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి మొత్తం 49,155 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.459 టీఎంసీల నీరు ఉంది.

■ జూరాల ఎగువ, దిగువలోని 11 యూనిట్లలో విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ హరిబాబు తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 196 మెగావాట్లు, 241.654 ఎంయూ, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 218.147 ఎంయూ ఉత్పత్తిని చేపట్టామన్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 459.801 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని తెలిపారు.

సుంకేసులకు 33వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల డ్యాంకు సోమవారం ఎగువ నుంచి 33,650 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ఏడు గేట్లు తెరిచి 31,353 క్యూసెక్కులను విడుదల చేశారు. కేసీ కెనాల్‌కు 2,265 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ రాజు పేర్కొన్నారు.

శ్రీశైలంలో నీటిమట్టం 882.4 అడుగులు

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో సోమవారం నీటిమట్టం 882.4 అడుగుల వద్ద 201.1205 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాల, సుంకేసుల నుంచి 77,393 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. శ్రీశైలంలో ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 27,452 మొత్తం 62,767 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు ద్వారా 10,000 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,520, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 1,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమ గట్టు భూగర్భకేంద్రంలో 15.987 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. కుడిగట్టు కేంద్రంలో 8.803 మి.యూనిట్లు ఉత్పత్తి చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత



ఆత్మకూర్: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు. ఆత్మకూర్‌లోని సంజీవ్‌నగర్ కాలనీలో దాసరి రాజు ఇంట్లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసినట్లు తెలియడంతో సోమవారం సాయంత్రం దాడులు నిర్వహించామన్నారు. 18 క్వింటాళ్ల బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకుని సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం అందించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆటోల్లో తరలిస్తుండగా...

గద్వాల క్రైం: పట్టణంలోని పిల్లిగుండ్ల కాలనీకి చెందిన విజయ్, సలీం, పరశు, సవారి, వీరేష్ రేషన్ కార్డుల లబ్ధిదారుల నుంచి 10 క్వింటాళ్ల బియ్యం సేకరించి, ఆ బియ్యాన్ని రెండు ఆటోల్లో తరలిస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు రెండు ఆటోలను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. అయిదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు.

కూలీ పనులకు వెళ్లి.. విగతజీవులుగా మారి

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కూలీల దుర్మరణం
- తిమ్మాజిపల్లిలో విషాదఛాయలు



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విజయుడు



జ్ఞానవంతుడు (ఫైల్)



జమ్మన్న (ఫైల్)

శాంతినగర్: కర్నూలు జిల్లాలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వడ్డేపల్లి మండలం తిమ్మాజిపల్లికి చెందిన ఇద్దరు కూలీలు మృతిచెందారు. వివరాల్లోకి వెళ్తే.. శాంతినగర్‌కు చెందిన పత్తి వ్యాపారి ఆంధ్రప్రదేశ్‌లోని ఆర్.కొంతలపాడు సమీప గ్రామాల్లో పత్తి కొనుగోలు చేశారు. పత్తిని బొలేరో వాహనంలో నింపేందుకు గాను తిమ్మాజిపల్లికి చెందిన జ్ఞానవంతుడు (25), కురువ జమ్మన్న (40)లతో పాటు మరో నలుగురు కూలీలను బొలేరో వాహనంలో వ్యాపారి తీసుకువెళ్లారు. పత్తిని లోడ్ చేసుకుని శాంతినగర్‌కు బయల్దేరిన క్రమంలో ఆర్.కొంతలపాడు సమీపంలోని వాగు వద్ద వాహనం అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ప్రమాదంలో జ్ఞానవంతుడు, జమ్మన్నలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. మిగతా నలుగురికి గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి మృతితో తిమ్మాజిపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబాలను పోషించే ఇద్దరు వ్యక్తులు మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులు, బంధువుల రోధనలు మిన్నంటాయి. పోస్టుమార్టం నిమిత్తం ఇద్దరి మృతదేహాలను కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

■ కర్నూలు ఆస్పత్రిలో బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే విజయుడు పరామర్శించారు. ముందుగా జ్ఞానవంతుడు, జమ్మన్న మృతదేహాలను పరిశీలించి, నివాళులర్పించారు. గాయాలపాలైన నలుగురికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. బాధిత కుటుంబాలకు అన్నివిధాలా అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

ఈతకు వెళ్లి బాలుడు మృతి

మదనాపురం: ఈతకు వెళ్లి బాలుడు మృతిచెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. మదనాపురం మండలంలోని నిలివిడి గ్రామానికి చెందిన అక్కమ్మ కుమార్తె జానకమ్మను కొత్తకోట మండలం రాణి పేటకు చెందిన సత్యంకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి కుమార్తెతో పాటు కుమారుడు తరుణ్ (12) ఉన్నాడు. కాగా జానకమ్మ దంపతులు బతుకుదెరువు కోసం హైదరాబాదు వెళ్లారు. అక్కడే తమ పిల్లలను చదివిస్తున్నారు. ఈ క్రమంలో దసరా పండుగ కోసం సెలవుల నేపథ్యంలో సమీప బంధువులతో కలిసి తరుణ్ తన అమ్మమ్మ అక్కమ్మ ఇంటికి ఆదివారం మధ్యాహ్నం వచ్చాడు. తోటి పిల్లలతో కలిసి సమీప వాగులోకి ఈతకు వెళ్లాడు. అతడికి ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. గమనించిన తోటి పిల్లలు బయటికి లాగేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు కొందరు క్షణాల్లో అక్కడకు చేరుకుని తరుణ్‌ను బయటకు తీశారు. కానీ అప్పటికే అతడు మృతిచెందాడు. విషయమై ఎస్ఐ శేఖర్‌రెడ్డిని వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

- రూ. 6.35 లక్షల నగదుతో పాటు 4 కార్లు, 3 బైక్‌లు, 15 సెల్‌ఫోన్లు స్వాధీనం
- పెబ్బేరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు



పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

వనపర్తి: జిల్లా సరిహద్దు ప్రాంతమైన పెబ్బేరు మండలం రంగాపూర్ శివారులోని ఓ గోదాంలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై సోమవారం ఎస్‌బీ, సివిల్ పోలీసులు సంయుక్తంగా మెరుపు దాడులు నిర్వహించారు. పేకాట రాయుళ్ల నుంచి రూ. 6.35 లక్షల నగదుతో పాటు నాలుగు కార్లు, 3 ద్విచక్ర వాహనాలు, 15 సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పెబ్బేరు ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు.. కొంత కాలంగా రంగాపూర్ శివారులోని గోదాంలో రహస్యంగా పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు గద్వాల ఎస్‌బీ, వనపర్తి సివిల్ పోలీసులు రైడ్ చేశారు. నోట్ల కట్టలను ముందుపెట్టుకుని పేకాట ఆడుతున్న 15 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో ధరూరు మండలం గుడ్డందొడ్డికి చెందిన పల్లె వెంకటయ్య, పారుచర్లకు చెందిన ఆంజనేయులు, గద్వాల మండలం దౌదర్‌పల్లికి చెందిన దౌలు, రాయచూరు మట్టిపేటకు చెందిన గింజిపల్లి వీరేష్, మల్దకల్ మండలం పెద్దొడ్డికి చెందిన నరసింహారెడ్డి, గద్వాలకు చెందిన అశోక్, సత్య స్వరూప్, ఎర్రవల్లికి చెందిన ఉప్పరి గోపాల్, పాడ రామిరెడ్డి, ఎర్రవల్లి మండలం కొండేరుకు చెందిన మద్దిలేటి, కుర్వ వీరన్న, వెంకటన్న, రాయచూరుకు చెందిన జలీల్ భాషా, పెబ్బేరు మండలం రంగాపూర్‌కు చెందిన వీరన్న, కృష్ణయ్య, చెలిమిల్లకు చెందిన నాగిరెడ్డి ఉన్నారు. దాడులు చేసిన అధికారుల్లో ఎస్‌బీ సీఐ నాగేశ్వర్‌రెడ్డి, ఎస్ఐలు వెంకటేష్, హరిప్రసాద్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

భార్యను హింసించిన భర్తకు రిమాండ్

జడ్చర్ల: కట్టుకున్న భార్యను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేసిన భర్తను సోమవారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సీఐ ఆదిరెడ్డి వివరాల మేరకు.. మండలంలోని చౌటగడ్డ తండాకు చెందిన ముడావత్ సరితతో ఆమె భర్త ముడావత్ భాస్కర్ గతనెల 27న అకారణంగా గొడవ పెట్టుకున్నాడు. ఈ క్రమంలో ఆమె మెడలో ఉన్న తాళిని తెంపివేసి, స్నానానికి సిద్ధం చేసుకున్న వేడి నీళ్లను ఆమెపై పోశాడు. దీంతో శరీరం బొబ్బలెక్కి కాలిపోగా.. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎస్‌వీఎస్ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి తల్లి కేతావత్ తారమ్మ ఫిర్యాదు మేరకు భాస్కర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరచగా.. రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

‘డాక్టర్’ కలకు ఆర్థిక కష్టాలు



తల్లిదండ్రులతో భాగ్యలక్ష్మి

- కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీటు సాధించిన నిరుపేద విద్యార్థి
- ఫీజు చెల్లింపు కోసం దీనంగా ఎదురుచూపులు
- లేదంటే సీటు వదుకోవాల్సిందేనని ఆవేదన
- అనారోగ్యంతో పనిచేయలేని తండ్రి.. తల్లి కష్టమే ఆధారం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): డాక్టర్ కావాలని ఎంతో కష్టపడి చదివింది.. తండ్రి ఏ పని చేయలేక పెద్ద ఆపరేషన్ కావడంతో ఇంటికే పరిమితమయ్యాడు. అయినప్పటికీ తల్లి కూలీ పనిచేస్తూ కూతురిని ఉన్నత చదువులు చదివించింది. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగానే బాగా చదువుకున్న భాగ్యలక్ష్మి ఎంబీబీఎస్ సీటు సాధించింది. అయితే ప్రస్తుతం ఎంబీబీఎస్‌లో అడ్మిషన్ కోసం ముందుగా రూ.1.40 లక్షలు అవసరం కావడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయింది.

ఇదీ కుటుంబ నేపథ్యం

జిల్లాకేంద్రం సింహగిరి ప్రాంతానికి చెందిన వెంకటేశ్– లావణ్య దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురికి పెళ్లి కాగా.. రెండో కూతురు భాగ్యలక్ష్మి. వెంకటేశ్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటంలో తనవంతుగా పోరాటం చేశారు. ప్రజా సమస్యలతోపాటు తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా ప్రజా సంఘాలతో కలిసి చురుకుగా పనిచేశారు. అయితే ప్రత్యేక రాష్ట్రం సిద్ధించినా ఆయనకు గుర్తింపు రాలేదు. ఈ క్రమంలోనే వెంకటేశ్‌కు పెద్ద ఆపరేషన్ కావడంతో ఏ పని చేయలేక ఇంటి పట్టునే ఉంటున్నాడు. దీంతో కుటుంబ భారమంతా తల్లి లావణ్యపై పడగా.. ఆమె కూలీ పనిచేస్తూ నెట్టుకొస్తుంది. చిన్ననాటి నుంచి చురుకుగా చదువుకున్న భాగ్యలక్ష్మి పదో తరగతిలో 10 జీపీఏ, ఇంటర్‌లో 988 మార్కులు సాధించింది. ఎంబీబీఎస్ సాధించాలనే లక్ష్యంతో ఇంట్లోనే ప్రిపేర్ అయ్యి.. ఎంసెట్‌లో 8 వేల ర్యాంక్, నీట్‌లో 9,036 ర్యాంక్‌తో సిద్దిపేట జిల్లాలోని సురభి మెడికల్ కళాశాల కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీటు సాధించింది.

దాతలు ఆదుకుంటే..

ఎంబీబీఎస్ సీటు సాధించిన భాగ్యలక్ష్మి అడ్మిషన్ పొందాలంటే ముందుగా రూ.1.40 లక్షలు చెల్లించాలి. ఇంత పెద్ద మొత్తం చెల్లించేందుకు తమకు ఆర్థిక స్థోమత లేదని ఆవేదన చెందుతుంది. తల్లిదండ్రులు కష్టపడి తనను ఇంత వరకు చదివించారని, ఫీజు చెల్లించాలని వాళ్లను ఒత్తిడి చేయలేక.. తన కల అయిన డాక్టర్ సీటును వదులుకోవాల్సి వస్తుందని వాపోయింది. దాతలు ఎవరైనా తన చదువుకు చేయూతనివ్వాలని కోరుతోంది. ఎవరైనా సహాయం చేయాలనుకునే వారు 9948875686 నంబర్‌కు ఫోన్ పే కానీ, గూగుల్ పే అయిన చేయగలరని వేడుకుంటున్నారు.

జింకులోపం లక్షణాలు





జింకులోపంతో ఉన్న వరి మొక్కలు

పాడి పంట

అధికారి సలహా: వ్యవసాయశాఖ అధికారి సక్రియ నాయక్

అలంపూర్: వరిసాగు పనులు కొనసాగుతున్నాయి. పంట సాగుకు అనువుగా అనేక మంది రైతులు వరి నారుమడులు పోసుకున్నారు. మడుల్లో జింకు లోపం లక్షణాలు ఉన్నాయేమో రైతులు పరిశీలించుకోవాలని జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయశాఖ అధికారి సక్రియ నాయక్ రైతులకు సూచిస్తున్నారు. లక్షణాలను గుర్తిస్తే తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. లేకుంటే ఎన్ని ఎరువులు వేసినా వ్యర్థమేనని పేర్కొన్నారు.

జింకు లోపం, లక్షణాలు, నివారణ చర్యలు

వరిలో ఎరువుల యాజమాన్య పద్ధతులు సద్వినియోగం కావాలన్నా, అధిక దిగుబడులు సాధించాలన్నా జింకు లోపం నివారణకు ప్రాధాన్యత ఇవ్వాలి. పైరు పెరుగుదలకు అవసరమైన పోషకాలను, నత్రజని, భాస్వరం, పొటాషియం ప్రధానమైనవి. వీటితో పాటు జింకు, కాల్షియం, మెగ్నీషియం వంటి 16 రకాల సూక్ష్మధాతువులు కూడా అవసరమే. వాటిలో జింకు పాత్ర కీలకం. ప్రధాన పోషకాలతో పోల్చితే ఇది చాలా తక్కువ పరిమాణంలో అవసరమైనా, ప్రాముఖ్యత విషయంలో ప్రధాన పోషకాలతో సమానం. జింకు లోపిస్తే ఎన్ని ఎరువులు వేసిన ఎటువంటి ఉపయోగం ఉండదు.

జింకు లోపిస్తే ఎరువులు వృథా!

జింకులోపం ఉంటే నత్రజని, భాస్వరం, పొటాష్ ఎంత వేసినా వృథాగా మారుతాయి. మొక్కలు, ఎరువులను సమర్థవంతంగా వినియోగించుకోలేవు. కనుక దిగుబడి పెరగదు. మొక్కల పెరుగుదల కోసం పలు రసాయన ప్రక్రియలో అవసరమయ్యే ఎంజైములు చురుకుదనాన్ని పెంచడానికి, ఉత్తేజ పర్చడానికి జింకు ఉపయోగపడుతుంది. ఈ పోషకం లోపిస్తే ఆ ప్రక్రియ సజావుగా జరగవు.

ముందస్తు చర్యలు..

జింకు లోపం ఉన్నట్లు తేలితే తప్పనిసరిగా ముందుగానే సరైన మోతాదులో జింకు సల్ఫేట్ వేసుకోవాలి. వరి పంటకైతే ఎకరానికి 20 కేజీల జింకు సల్ఫేట్‌ను దుక్కిలో నాటే ముందు వేసుకోవాలి. మూడు పంటలకు ఒకసారి లేక రెండేళ్లకు ఒక సారి వేసుకోవాలి. ఏటా వరిసాగు చేస్తుంటే రబీలోనే జింకు వేసుకోవాలి. సమస్యాత్మక నేలలు అంటే క్షార, చౌడు, సున్నపు నేలైతే జింకు సల్ఫేట్‌ను ఎకరానికి 40 కిలోల చొప్పున వేసుకోవాలి.

నివారణ చర్యలు!

వరిలో జింకు లోపం కనిపిస్తే పది లీటర్ల నీటికి 20 గ్రాముల జింకు సల్ఫేట్ కలిపి ఎకరానికి 200 లీటర్ల చొప్పున పిచికారీ చేయాలి. ఈ విధంగా వారం రోజుల వ్యవధిలో రెండుమూడు దఫాలు పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుంది. ఎకరానికి రెండు కింటాళ్ల పశువుల ఎరువులు, కంపోస్టు, కోడి ఎరువు, ఫిల్టర్ మట్టి వంటి సేంద్రియ ఎరువులతో 15 కేజీల జింకు సల్ఫేట్ కలిపి నెల రోజులు మాగనిచ్చి నాటే ముందు దుక్కిలో వేస్తే దిగుబడిలో మార్పు కనిపిస్తుంది.

జింకు లోపాన్ని ఇలా గుర్తించాలి

వరి నారు మడి దశలో, నాటిన తర్వాత కూడా జింకు లోపం కనిపిస్తోంది. సాధారణంగా నాట్లు వేశాక రెండు నుంచి నాలుగు వారాల మధ్య, నాలుగు నుంచి ఆరు వారాల మధ్య జింకు లోపం లక్షణాలు బయటపడతాయి. జింకు లోపం ఉన్న పొలాల్లో ప్రధాన పోషకాలు తగినంత వేసినా పంట సరిగా పెరగదు. పిలకలను పెట్టదు. పొలంలో మొక్కలు చనిపోయి ఖాళీలు కనిపిస్తాయి. పొలం అంత పసుపు పచ్చగా కనబడుతుంది. దగ్గరగా చూస్తే మొక్కల్లో పై నుంచి మూడు లేక నాలుగు ఆకుల మధ్య ఈనె మొదలు భాగం ఆకు పచ్చరంగు కోల్పోయి పసుపుతో కూడిన తెలుపు రంగులోకి మారుతుంది. ఆకులోని మిగిలిన భాగం అంతా ఆకు పచ్చగానే ఉంటుంది. ఆకులు చిన్నగా నూలు కండీలుగా మారి మొద్దు బారుతాయి. గట్టిగా మారి వంచి చూస్తే శబ్దం చేస్తూ విరుగుతాయి.



క్లుప్తంగా...

పవన్ కల్యాణ్‌పై కేఏ పాల్ ఫిర్యాదు



పంజగుట్ట (హైదరాబాద్): తిరుపతి లడ్డూ విషయంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 100 కోట్ల మంది హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లాడారని, అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ కేఏ పాల్ సోమవారం పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం పాల్ మాట్లాడుతూ లక్ష లడ్డూలు కల్తీ చేసి అయోధ్యకు పంపించారని అబద్ధపు మాటలు మాట్లాడారని, లడ్డూపై విచారణ జరిగిందే జూన్‌లో కాగా, అయోధ్య ప్రారంభోత్సవం జనవరిలో జరిగిందని కల్తీ ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. 14 సెక్షన్ల కింద ఫిర్యాదు చేశానని, ఆర్టికల్ 8 ప్రకారం ఆయన్ను వెంటనే ఉపముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించాలని, లేదా ఆయనే స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పవన్‌కల్యాణ్‌కు ఎవరు స్క్రిప్ట్ ఇస్తే.. అది సినిమాలో మాదిరి చదువుతున్నాడని, గతంలోనే చెప్పినా వినిపించుకోలేదన్నారు. ఏపీ స్పీకర్, గవర్నర్, దేశ ప్రధాని, కేంద్ర హోంమంత్రి, చీఫ్ జస్టిస్, సీబీఐ అతనిపై విచారణ చేయాలని, వెంటనే పవన్‌కల్యాణ్ ఉపముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు.

ఆదాయంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు నాలుగో స్థానం



సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆదాయంలో నాలుగో స్థానంలో నిలిచింది. 2023–24 సంవత్సరానికి సంబంధించి ఎక్కువ ఆదాయం పొందిన రైల్వే స్టేషన్ల జాబితాను రైల్వే శాఖ తాజాగా ప్రకటించింది. ఈ జాబితాలో ఢిల్లీ మొదటి స్థానంలో, హౌరా రెండో స్థానం, చెన్నై మూడో స్థానంలో నిలిచాయి. న్యూఢిల్లీ స్టేషన్ నుంచి రూ.3,337 కోట్ల ఆదాయం రాగా, హౌరా స్టేషన్ నుంచి రూ.1,692 కోట్లు, చెన్నై సెంట్రల్ నుంచి రూ.1,299 కోట్లు, సికింద్రాబాద్ నుంచి రూ.1,276 కోట్ల ఆదాయం సమకూరింది.

•బాబు జమానా.. అవినీతి ఖజానా

ముంపులోనూ మేసేశారు

చంద్రబాబు వరద లెక్కల్లో బయటపడిన దిమ్మతిరిగే అవినీతి

అరకొర సహాయక చర్యలు.. వాటిలోనే రూ.534 కోట్లు బొక్కేశారు

బుడమేరు గేట్లెత్తి బెజవాడను నిండా ముంచిన చంద్రబాబు సర్కారు.. ఆదుకోండి మహాప్రభో అని వేడుకునేందుకు వచ్చిన వరద బాధితులను కలెక్టరేట్ గేట్లు మూసి నిర్దయగా గాలికొదిలేసింది. కానీ.. అదే వరద పేరు చెప్పి పాలకులు రూ.వందల కోట్లు కొల్లగొట్టేశారు. సహాయక చర్యలు చేపట్టి బాధితుల్ని ఆదుకున్నట్టు ఇప్పటికీ గొప్పలు చెప్పుకుంటున్న చంద్రబాబు.. ఆ ముసుగులో ఏ పనీ చేయకుండానే ఖర్చుల పేరిట ఖజానా నుంచి భారీఎత్తున నిధులను పక్కదారి పట్టించారు.



- భోజనాలకే రూ.368 కోట్ల వ్యయం
- అసలు పెట్టని ఒక్కో భోజనానికి రూ.376 చొప్పున ఖర్చు
- ఎక్కడా కల్పించని తాత్కాలిక వసతికి రూ.1.39 కోట్లు.. పంచని అగ్గిపెట్టెలు, కొవ్వొత్తులకు రూ.23 కోట్లు
- కేవలం డ్రోన్లకే రూ.2 కోట్లు
- మంచినీళ్ల బాటిళ్ల కోసం ఏకంగా రూ.26 కోట్లు.. వాటికి అంత ఖర్చవుతుందా! అని ప్రశ్నిస్తున్న జనం
- అవన్నీ ఎక్కడ పంచారని బాధితుల నిలదీత

సాక్షి, అమరావతి: వరద సహాయక చర్యల కోసం ప్రభుత్వం చేసిన ఖర్చుల లెక్కలు ప్రజల్ని నివ్వెరపరుస్తున్నాయి. బుడమేరు, కృష్ణా వరదలో పేరుకుపోయిన అవినీతి బురదను చూసి జనం అసహ్యించుకుంటున్నారు. సహాయ, పునరావాస చర్యల్లో ఘోరంగా విఫలమైన టీడీపీ సర్కారు.. ఖర్చులు మాత్రం దిమ్మతిరిగేలా చూపడంతో ఇంత ఖర్చు ఎక్కడ పెట్టారోనని ముక్కున వేలేసుకుంటున్నారు. అసలు సహాయక చర్యలే చేపట్టక జనం అల్లాడిపోతే ప్రభుత్వం ఏకంగా రూ.534 కోట్లను రిలీఫ్ క్యాంప్‌ల కోసం ఖర్చు చేసినట్టు చెబుతుండటం విస్తుగొలుపుతోంది. గత నెలలో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలను వరదలు అతలాకుతలం చేసినా ప్రభుత్వం ఎక్కడా పునరావాస కేంద్రాలు తెరవలేదు. విజయవాడలోని సగం ప్రాంతం మునిగిపోయినా పునరావాస కేంద్రాలు లేకపోవడంతో జనం డాబాలపైన, అపార్ట్‌మెంట్స్‌లోని పై అంతస్తుల్లోనే వారం రోజులపాటు గడిపారు. కాగితాల్లో పునరావాస కేంద్రాలు తెరిచినట్టు చూపించినా రెండు, మూడు మినహా అవి ఎక్కడా లేవు. తెరవని పునరావాస కేంద్రాల కోసం రూ.1.39 కోట్లు ఖర్చయినట్టు ప్రభుత్వం లెక్క రాసేసింది.

భోజనం ఖర్చు రూ.376

అన్ని ఖర్చుల్లోనూ భోజనాల ఖర్చే రూ.368.18 కోట్లు చూపించడంతో వరద బాధితులు నోరెళ్లబెడుతున్నారు. బాధితులకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు పెద్దఎత్తున ఆహారం సమకూర్చారు. వరద ఎక్కువగా ఉండటంతో ముంపు ప్రాంతాల్లో శివారు ప్రాంతాలకు వాటిని తీసుకెళ్లడం సాధ్యం కాలేదు. కానీ.. చంద్రబాబు మాత్రం ప్రభుత్వం తరఫున 97 లక్షల మందికి ఆహారం అందించినట్టు లెక్క రాసేశారు. 3.97 లక్షల మందికి టిఫిన్, 4.33 లక్షల మందికి మధ్యాహ్న భోజనం, 4.26 లక్షల మందికి రాత్రి భోజనం ఇచ్చినట్టు ఆయనే స్వయంగా పలుమార్లు వెల్లడించారు. 97.70 లక్షల మందికి టిఫిన్, లంచ్, డిన్నర్‌కి రూ.368.18 కోట్లు ఖర్చు చేసినట్టు లెక్కల్లో చూపారు. అంటే ఒక్కో బాధితుడికి రోజుకు రూ.376 చొప్పున ఆహారం కోసం ఖర్చు చేసినట్టు రాసుకుని ఆ మొత్తాన్ని కొల్లగొట్టారు. ఆహారం అందక జనం అష్టకష్టాలు పడితే.. వారికి స్టార్ హోటల్ భోజనం పెట్టినట్టు చెప్పడాన్ని బట్టి అవినీతి ఏ స్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చు.

మంచినీళ్లలోనూ అదే తీరు

వరద బాధితులకు 94 లక్షల మంచినీళ్ల బాటిళ్లు ఇచ్చినట్టు లెక్క రాసుకుని రూ.26.80 కోట్లను పాలకులు బొక్కేశారు. 94 లక్షల బాటిళ్లలో పావు వంతు కూడా జనానికి అందలేదు. నిత్యావసర సరుకులు కూడా అందరికీ అందకపోయినా లక్షలాది మందికి ఇచ్చేసినట్లు.. అందుకోసం రూ.61 కోట్లకు పైగా ఖర్చయినట్టు లెక్కల్లో చూపించారు. విజయవాడ సింగ్‌నగర్ పరిసరాల్లో ఇప్పటికీ కొన్నిచోట్ల వరద కంపు కొడుతున్నా, చెత్త కనిపిస్తున్నా పారిశుద్ధ్యం మాత్రం సూపర్‌గా ఉందని.. ఇలా చేయడానికి రూ.51 కోట్లు ఖర్చయ్యిందని లెక్కల్లో రాసేసుకున్నారు.

అగ్గిపెట్టెలు, కొవ్వొత్తుల కోటా రూ.23 కోట్లు

అన్నిటికంటే విచిత్రమైన విషయం కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలకు రూ.23.07 కోట్లు ఖర్చవడం. అసలు జనానికి ఇవి ఎక్కడ ఇచ్చారో అధికారులు కూడా చెప్పలేకపోతున్నారు. ఏ ప్రాంతంలో వరద బాధితుల్ని అడిగినా కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు ఎక్కడ ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. దీనిపై తీవ్రస్థాయిలో విమర్శలు రావడంతో మొబైల్ జనరేటర్ల ఖర్చు కూడా అందులో ఉందని కవర్ చేసుకుంటున్నారు. కానీ.. అవి ఎక్కడ, ఎన్ని పెట్టారో కూడా అధికారులకు తెలియదు. అవినీతి వరదలో వీటి ఖర్చే వింతల్లోకెల్లా వింతగా కనిపిస్తోంది.

డ్రోన్ల ఖర్చు రూ.2 కోట్లు

వరద ఖర్చుల వింతల్లో డ్రోన్ల ఖర్చు సరికొత్తగా ఉంది. కేవలం డ్రోన్ల కోసం రూ.2 కోట్లు ఖర్చు చేసినట్టు చూపించారు. డ్రోన్లతో ఆహారం సరఫరా చేసినట్టు ఏఐ సాయంతో ఫొటోలు తయారు చేసి.. ఇప్పుడు వాటికి కోసం కోట్లు ఖర్చయినట్టు లెక్కలు రాశారు. చెత్త తరలింపు, వరద నీరు తోడటం వంటి ఖర్చులే రూ.7 కోట్లు దాటిపోయాయి. వరద బాధితుల తరలింపు, చెత్త ఎత్తడం, పారిశుద్ధ్యం ఈ లెక్క వేరేగా ఉంది. అవన్నీ కలుపుకుంటే ఖర్చులే రూ.557 కోట్లు దాటిపోయింది.

ఇవన్నీ ఎక్కడ పంచారు

ఇంత భారీ ఎత్తున సహాయ, పునరావాస చర్యల కోసం ఖర్చు పెట్టినట్టు ప్రభుత్వం చెబుతుండటంతో అంత ఖర్చు ఎక్కడ పెట్టారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. చేయని ఖర్చుకు భారీగా లెక్కలు చూసి సర్కారు పెద్దలు దండుకున్నట్టు ఏ లెక్క చూసినా స్పష్టమవుతోంది. ఈ సొమ్ములో చాలా వరకూ విడతల వారీగా ఇప్పటికే విడుదలైంది. కలెక్టర్లు, వివిధ శాఖల ద్వారా ఆ సొమ్మును డ్రా చేసి బిల్లులు కూడా చాలా వరకూ చెల్లించేశారు. వరద ఖర్చుల్లో ఒక్కో అంశంపైనా అవినీతి కేసులు పెట్టవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వరద బాధితులను ఆదుకోకపోగా వారి పేరుతో రూ.వందల కోట్లు దోచేయడంపై ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

రూ.500 కోట్ల విరాళాలు హుష్ కాకే!

వరద బాధితులను ఆదుకోవడానికి చంద్రబాబు భారీగా విరాళాలు సేకరించారు. ఇప్పటివరకు రూ.500 కోట్లకుపైగా నిధులు దాతల నుంచి అందినట్టు ప్రకటించారు. విరాళాలు బాగా వచ్చాయనుకుంటే.. వాటికి మించి రూ.557 కోట్ల ఖర్చుల లెక్కలు చూపించడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రాన్ని కుంగదీసిన వరద చంద్రబాబు సర్కారుకు కాసులు కురిపించినట్టు స్పష్టమవుతోంది. బాధితులకు రూ.602 కోట్ల నష్టపరిహారం ఇచ్చినట్టు ప్రకటించినా.. ఇంకా చాలా మందికి అందలేదు. నిత్యం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట బాధితులు చేస్తున్న ఆందోళనలే ఇందుకు నిదర్శనం.

సర్వభూపాలపై సర్వాంతర్యామి




సర్వ భూపాల వాహనంపై విహరిస్తున్న మలయప్ప

తిరుమల: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు తిరుమలలో వైభవంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన సోమవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి సర్వభూపాల వాహనంపై వేణుగోపాలకృష్ణుడి అలంకారంలో దర్శనమిచ్చారు. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్త బృందాల భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ ఈ వాహన సేవ వైభవంగా సాగింది. ఉదయం కల్పవృక్ష వాహనంపై రాజమన్నార్ అలంకారంలో మలయప్ప దర్శనమిచ్చారు.

చంద్రబాబుకు హైదరాబాద్‌పై తగ్గని మక్కువ

ఏపీ సీఎంగా ఉన్నా.. వారానికి రెండురోజులు ఇక్కడే!



- ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడూ చుట్టపు చూపుగానే ఏపీకి చంద్రబాబు
- తెలంగాణలో టీడీపీ బలోపేతం పేరుతో కొత్త రాజకీయం
- తాజాగా టీడీపీలో చేరుతానని ప్రకటించిన మాజీ మేయర్ తీగల
- మనవరాలి పెళ్లికార్డు ఇవ్వడానికి కలసిన మాజీ మంత్రి మల్లారెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు హైదరాబాద్‌పై మక్కువ తీరడం లేదు. తెలంగాణ వెనుకబాటు తనానికి, వనరుల దోపిడీకి కారణం చంద్రబాబేనని తెలంగాణవాదులు ఎన్ని విమర్శలు చేసినా, ఏపీకి సీఎం అయ్యాక హైదరాబాద్‌లో ఏంపని అని ఆంధ్రప్రదేశ్ ప్రజలు ప్రశ్నిస్తున్నా.. ఆయన పట్టించుకోవడం లేదు. జూన్ 12న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత చంద్రబాబు సుమారు 10 సార్లు హైదరాబాద్ వచ్చారు. మరీ అత్యవసర పని మినహాయిస్తే.. దాదాపుగా ప్రతి శని, ఆదివారాలు ఆయన హైదరాబాద్‌లోనే మకాం వేస్తూ.. ఇక్కడి నుంచే రాజకీయాలు నడుపుతున్నారన్న విమర్శలున్నాయి. ఆయన ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు చుట్టపుచూపుగానే వెళ్లి వచ్చేవారని గుర్తు చేస్తున్నారు. ఏపీలో ప్రతిపక్ష నేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి బెంగళూరు వెళ్తే రాద్ధాంతం చేస్తున్న తెలుగుదేశం పార్టీ నేతలు.. ముఖ్యమంత్రిగా చంద్రబాబు హైదరాబాద్‌లో ఎందుకు మకాం వేస్తున్నారో చెప్పాలని తెలంగాణ వాదులు ప్రశ్నిస్తున్నారు. కాగా చంద్రబాబు హైదరాబాద్‌కు వచ్చినప్పుడల్లా.. గతంలో తెలుగుదేశం పార్టీలో పనిచేసి, తెలంగాణ ఏర్పాటు తరువాత బీఆర్ఎస్‌లోకి వెళ్లిన నాయకులు, ప్రజాప్రతినిధులు తరచూ కలుస్తుండడం కొత్త అనుమానాలను రేకెత్తిస్తోంది. తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొలువు తీరిన తరువాత కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో ఎక్కువ మంది అంతకు ముందు చంద్రబాబును కలసి చర్చలు జరిపిన వారే కావడం విశేషం. జూలై మొదటి వారంలో చంద్రబాబును కలసిన అరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్ ఆ తరువాతే కాంగ్రెస్ గూటికి చేరారు. తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం అప్పట్లో చంద్రబాబును ఆయన నివాసంలో కలసి చర్చలు జరిపారని గుర్తు చేస్తున్నారు.

తెలుగుదేశం పార్టీలో చేరుతానన్న తీగల కృష్ణారెడ్డి

మహేశ్వరం టీడీపీ ఎమ్మెల్యేగా 2014లో ఎన్నికై బీఆర్ఎస్‌లో చేరి, 2018లో ఓడిపోయిన హైదరాబాద్ నగర మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డికి 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ టికెట్ ఇవ్వలేదు. దీంతో ఆయన రాజకీయ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. ఈ నేపథ్యంలో ఆయన తన కోడలు తీగల అనితారెడ్డితో కలసి ఫిబ్రవరి 26న కాంగ్రెస్‌లో చేరారు. అయితే కాంగ్రెస్‌లో కూడా తగిన ప్రాధాన్యం లభించకపోవడంతో ఆయన కొంతకాలంగా స్తబ్ధుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆయన చంద్రబాబును జూబ్లీహిల్స్‌లోని నివాసంలో కలిశారు. అదే సమయంలో బాబుతో భేటీ అయిన మాజీ మంత్రి మల్లారెడ్డి.. తన మనవరాలి వివాహానికి ఆహ్వానించేందుకు చంద్రబాబును కలసినట్లు చెప్పగా, తీగల కృష్ణారెడ్డి మాత్రం తాను త్వరలోనే టీడీపీలో చేరనున్నట్లు స్పష్టం చేశారు. తనతో పాటు చాలా మంది టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని తీగల వ్యాఖ్యానించారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేస్తామని ఎన్నికల ముందు కూడా చెప్పిన చంద్రబాబు తన అనుయాయుడు రేవంత్‌రెడ్డి కోసం ఆ ఎన్నికల్లో అభ్యర్థులను కూడా నిలబెట్టలేని విషయాన్ని పరిశీలకులు గుర్తు చేస్తున్నారు.

రెండో రోజు కొనసాగిన విచారణ



మెప్మా భవనంలో మహిళా సంఘ సభ్యులతో విచారణ జరుపుతున్న ఆర్పీలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మహిళా సంఘ మహిళల పేరుతో స్థానిక కోయనగర్‌కు చెందిన ఆర్పీ శ్రీలత తీసుకున్న రుణాలకు సంబంధించి కిస్తులు చెల్లించకుండా భారీ ఎత్తున పక్కదారి పట్టించిన విషయం విదితమే. కాగా, బాధితుల ఫిర్యాదు మేరకు అధికారులు చేపట్టిన విచారణ సోమవారం రెండో రోజుకు చేరింది. మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని మెప్మా భవనంలో పది సంఘాలకు చెందిన మహిళలతో స్త్రీనిధి ఆర్ఎం వేణుగోపాల్‌రెడ్డి, మెప్మా సీఓలు వరలక్ష్మి, ఆంజనేయులు, నిర్మల పూర్తి వివరాలు సేకరించారు. తాజాగా మరో రూ.15 లక్షల వరకు అవకతవకలు బయటపడ్డాయి. ముఖ్యంగా కొందరు ఎస్‌హెచ్‌జీ సభ్యులకు తెలియకుండానే ఈమె బ్యాంకు లింకేజీ, స్త్రీనిధితో పాటు పొదుపు ఖాతాలకు చెందిన డబ్బులను సైతం దుర్వినియోగం చేసినట్లు తేలింది. ఈ వ్యవహారంలో కొందరు బ్యాంకు అధికారుల ప్రమేయం ఉన్నట్టు సమాచారం. కాగా, మొదటి రోజు ఈనెల 5న దొడ్డలోనిపల్లి రెవెన్యూ వార్డు కార్యాలయంలో 12 ఎస్‌హెచ్‌జీ సభ్యులతో విచారణ జరపగా రూ.62.72 లక్షలు పక్కదారి పట్టినట్టు బయటపడింది. ఇప్పటివరకు మొత్తం రూ.82.72 లక్షల మేర దుర్వినియోగమైనట్టు అధికారులు భావిస్తున్నారు. ఈ విచారణ మంగళవారం సైతం మిగిలిన 11 మహిళా సంఘాల సభ్యులతో సమగ్రంగా వివరాలు సేకరించనున్నారు. దీంతో ఈ అక్రమాల చిట్టా ఇంకా పెరిగే అవకాశం ఉంది.

ప్రారంభానికి ఆర్‌యూబీ రెడీ



ప్రారంభానికి సిద్ధమైన రైల్వే అండర్ బ్రిడ్జి

- వచ్చేనెల మొదటి వారంలో ప్రారంభించే అవకాశం
- రైల్వే అధికారులతో కలిసి ఆర్‌యూబీని పరిశీలించిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



ఆర్‌యూబీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, అధికారులు

జడ్చర్ల: పట్టణ ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రైల్వే అండర్ బ్రిడ్జి త్వరలోనే ప్రారంభం కానుంది. కొన్నేళ్లుగా రాకపోకలు లేక నిర్మానుష్యంగా మారిన ఈ ప్రాంతం మళ్లీ పూర్వవైభవం సంతరించుకోనుంది. దాదాపు రెండేళ్లకు పైగా రాకపోకలు నిలిచిపోవడంతో బాదేపల్లి పాత బజార్ ప్రాంత వాసులతో పాటు ఆలూరు, యాసాయకుంట తండా, బూరెడ్డిపల్లి, పద్మావతి కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వీరంతా చుట్టూ తిరిగి రాకపోకలు సాగిస్తున్నారు. మరోవైపు ట్రాఫిక్‌తో సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్‌యూబీని వచ్చేనెల మొదటి వారంలో ప్రారంభిస్తామని స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, దక్షిణమధ్య రైల్వే అధికారులు ప్రకటించడంతో ఈ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొన్నేళ్లుగా అవస్థలు..

జడ్చర్ల రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వేగేటు సమస్య కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉంది. గంటల తరబడి గేటు మూసివేతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఒక్కోసారి రెండు, మూడు రోజులపాటు గేటు బంద్ ఉండేది. ఈ దారి గుండా ఆర్టీసీ బస్సుల రాకపోకలను నిలిపివేయడంతో దశాబ్దాల చరిత్ర కలిగిన బాదేపల్లి బస్టాండ్ ఏకంగా మూతపడింది. సమస్య పరిష్కారంపై అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న మల్లు రవి ప్రత్యేక చొరవ చూపడతో ఆర్‌ఓబీ నిర్మాణానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సుమారు రూ. 30 కోట్లు మంజూరు చేశారు. అయితే పట్టణ వ్యాపారులు ఆర్‌ఓబీకి వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టడంతో, ఆర్‌ఓబీ ఏర్పాటు ప్రక్రియ వెనక్కి తగ్గి.. ఆర్‌యూబీ తెరపైకి వచ్చింది.

రాజకీయ నీడలు..

ఆర్‌యూబీ ఏర్పాటు ప్రక్రియపై రాజకీయ నీడలు అలుముకున్నాయి. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న లక్ష్మారెడ్డి ఆర్‌యూబీ మంజూరు చేయించినట్లు పలుమార్లు ప్రకటించారు. అయితే స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అప్పట్లో ఆర్‌యూబీ మంజూరు అంతా భూటకమంటూ అదే ప్రదేశంలో ఒకరోజు దీక్ష చేపట్టారు. అనంతరం రూ. 10 కోట్ల వ్యయంతో పనులు చేపట్టారు. ఎట్టకేలకు పనులు పూర్తి కావడంతో మరో నెలలో ఆర్‌యూబీ ప్రజలకు అందుబాటులోకి రానుంది.

త్వరలోనే ప్రారంభిస్తాం..

ఆర్‌యూబీని త్వరలోనే ప్రారంభిస్తామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన దక్షిణమధ్య రైల్వే డీజీఎం మూర్తి, ఏజీఎం శ్రీనివాసులుతో కలిసి ఆర్‌యూబీ పనులను పరిశీలించారు. ఇప్పటికే పనులు పూర్తయ్యాయని.. డ్రెయినేజీ పనులు, ఆర్‌యూబీకి రంగులు వేసే పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఆయా పనుల పూర్తికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

నల్లమలను పర్యాటకంగా తీర్చిదిద్దుతాం



ఉమామహేశ్వర ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే వంశీకృష్ణ తదితరులు

- రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ

అచ్చంపేట: రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తోందని, ఈ క్రమంలోనే నల్లమలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం అచ్చంపేట మండలం భోగమహేశ్వరంలో ఉమామహేశ్వరస్వామి దేవస్థాన నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా.. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పాలక మండలి సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ త్వరలో నల్లమలలోని ఆలయాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించి అభివృద్ధి, మౌలిక వసతులకు సంబంధించి ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నేతలను గెలిపించుకునే బాధ్యత ప్రతి కార్యకర్త తీసుకోవాలన్నారు. నల్లమల్లలో పర్యాటక, ఆలయాల అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించాలని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మంత్రిని కోరారు. ఉమామహేశ్వర ఆలయ అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు చేస్తానని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, నూతన చైర్మన్ మాధవరెడ్డి, మార్కెట్ చైర్మన్ రజిత, గ్రంథాలయాల చైర్మన్ రాజేందర్, గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్ గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వెనుకబాటుకు బీఆర్‌ఎస్సే కారణం

బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయంలో తెలంగాణ వెనుకబాటుకు గురైందని, మిగులు బడ్జెట్‌గా ఉన్న రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిందని మంత్రి కొండా సురేఖ విమర్శించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి విడతల వారీగా అమలు చేస్తున్నారని చెప్పారు. కాళేశ్వరం, మిషన్ భగీరథ పథకాల్లో కమీషన్లు దండుకొని రూ.1,500 కోట్లును బీఆర్ఎస్ పార్టీ ఫండ్‌లో దాచిపెట్టారని ఆరోపించారు. కేసీఆర్ ఇచ్చిన కేజీ టు పీజీ, దళితులకు మూడు ఎకరాల భూమి, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేకపోయారన్నారు. కేసీఆర్ నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు లబ్ధిదారుల ఎంపికపై సంతకం చేయని కారణంగా నిలిచిపోయిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే 40 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని, నిన్న గురుకుల ఉపాధ్యాయుల భర్తీ, ఈ నెల 9న 11 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఇచ్చిన హామీలను ఈ ప్రభుత్వం విడతవారీగా అమలు చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా పాలనలో ఆరు గ్యారంటీల అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నారని, ఇప్పటికే ఉచిత బస్సు ప్రయాణం, విద్యుత్, సిలిండర్, రుణమాఫీ వంటి పథకాలను అమలు చేశామన్నారు.

ఊరెళ్తున్నారా.. జాగ్రత్త!

తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటున్న దొంగలు

మహబూబ్‌నగర్ క్రైం: దసరా పండగ నేపథ్యంలో చాలా మంది పట్టణాల నుంచి స్వగ్రామాలకు వెళ్తుంటారు. ఇప్పటికే విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడంతో ఇళ్లకు తాళాలు వేసి.. దూర ప్రాంతాలకు పయనమవుతున్నారు. ఈ క్రమంలోనే తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగలు రెచ్చిపోయే ప్రమాదం ఉంది. గతంలో ఈ సీజన్‌లోనే అనేక చోరీ కేసులు నమోదయ్యాయి. రోజురోజుకూ నేరగాళ్ల సంఖ్య పెరుగుతుండటంతో వారిని గుర్తించడం పెద్ద తలనొప్పిగా మారింది.

పాటించాల్సిన జాగ్రత్తలు..

- ఎక్కువ రోజులు ఊరికి వెళ్తే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వడం మంచిది.
- ప్రధాన ద్వారాలు కాకుండా ఇతర ద్వారాలు ఉంటే, వాటికి తాళం వేస్తూ.. మిగతా వాటికి లోపలి భాగంలో తాళం వేయాలి. అలా వేయడంతో ఇంట్లోని వాళ్లు ఊరు వెళ్లారనే అనుమానం చోరులకు రాకుండా ఉంటుంది.
- ఇంట్లో లేకున్నా గదుల్లో విద్యుత్ దీపాలు వేసి ఉంచాలి. దీంతో పాటు తాళం వేసి ద్వారాలకు పరదాలు వేస్తే కనబడకుండా ఉంటాయి.
- విలువైన ఆభరణాలు, నగదు వెంట తీసుకువెళ్లాలి. లేకుంటే బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి.
- రాత్రిపూట ఒంటరిగా వెళ్లాల్సి వస్తే, మహిళలు తక్కువగా ఆభరణాలు ధరించాలి. అవసరం అయితే భుజం పైనుంచి కొంగు కప్పుకొని వెళ్లడం మరింత శ్రేయస్కరం.



- ఊరెళ్లే ముందు ద్విచక్ర వాహనాలు ఆరుబయట, ప్రహరీ లోపల, ఇంటి ముందు పెట్టి వెళ్లకూడదు. వాహనానికి జాగ్రత్తగా తాళంవేసి, సుపరిచితుల ఇళ్లలో పెట్టి పోవడం చాలా మంచిది.

గస్తీ ముమ్మరం చేయాలి..

సెలవులలో చాలా మంది వివిధ ప్రాంతాలు, సొంత గ్రామాలకు ఎక్కువగా వెళ్లే వారి ప్రాంతాలు, కాలనీల్లో గస్తీని ముమ్మరం చేయాల్సిన అవసరం ఉంది. జిల్లా కేంద్రంలో ఉన్న మూడు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్, రక్షక్‌లతో రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు గస్తీ నిర్వహించాలి. ప్రజలు అత్యవసర సమయంలో 100 లేదా పట్టణ పోలీస్‌స్టేషన్లకు ఫోన్ చేయాలి.

ప్రత్యేక బృందాల ఏర్పాటు..

చోరీలు ఎక్కువగా జరిగే (క్రైంజోన్) ఏరియాల్లో పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ గస్తీ పెంచుతాం. సెలవులు పూర్తయ్యే వరకు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేస్తాం. వేరే ప్రాంతాలకు వెళ్లేవారు ఇంటి ప్రధాన డోర్‌కు లోపలి నుంచి తాళం వేసి, లోపల ఒక లైట్ వెలిగే విధంగా చూడాలి. ప్రధానంగా బంగారం, నగదు ఇంట్లో పెట్టరాదు. జిల్లా కేంద్రంలో వరస చోరీలు జరుగుతున్న కాలనీలను గుర్తించాం. వాటిని హాట్‌స్పాట్ కిందకు చేర్చాం. కాలనీల్లో కొత్త వ్యక్తుల కదలికలు, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాం.

– వెంకటేశ్వర్లు, డీఎస్పీ, మహబూబ్‌నగర్

ప్రయాణం.. ప్రమాదకరం



కొందరు ప్రైవేట్ వాహనదారులు నిర్లక్ష్యం వీడటం లేదు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఆటోలు, జీపులు, బొలెరో వంటి వాహనాల్లో పరిమితికి మించి ప్రజలను తరలిస్తూ అమాయకుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ప్రధానంగా గద్వాల, ధరూరు, గట్టు ప్రాంతాల నుంచి గూడ్సు వాహనాల్లో పరిమితికి మించి కూలీలను తరలిస్తున్నారు. ఈ క్రమంలో చిన్నపాటి ప్రమాదాలు జరిగినా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. – మల్దకల్